క్లుప్తంగా

మైదుకూరు డీఎస్పీగా రాజేంద్ర ప్రసాద్



కడప అర్బన్: వైఎస్ఆర్ జిల్లా మైదుకూరు డీఎస్పీగా కడప ఇంటలిజెన్స్ డీఎస్పీగా పనిచేస్తున్న జి. రాజేంద్ర ప్రసాద్‌ను నియమిస్తూ రాష్ట్ర డీజీపీ సీహెచ్ ద్వారకా తిరుమలరావు ఉత్తర్వులను జారీ చేశారు. 1995 బ్యాచ్‌కు చెందిన ఈయన వైఎస్ఆర్ జిల్లాలోనే ఎస్ఐగా, సీఐగా పనిచేశారు. 2008లో సీఐగా, 2023 డిసెంబర్ 23న డీఎస్పీగా పదోన్నతి పొందారు. ప్రస్తుతం కడప ఇంటలిజెన్స్ డీఎస్పీగా పనిచేస్తూ మైదుకూరు డీఎస్పీగా బదిలీ అయ్యారు.

కేరళ బాధితులకు అండగా నిలబడాలి



విరాళాలు సేకరిస్తున్న రైల్వే గూడ్స్ షెడ్ హమాలీ వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : కేరళలోని వయనాడ్ జిల్లాలో చోటుచేసుకున్న ప్రకృతి విపత్తు సమయంలో ప్రజలంతా అండగా నిలబడాలని రైల్వే గూడ్స్ షెడ్ హమాలీ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ అధ్యక్ష, కార్యదర్శులు కేసీ బాదుల్లా, ఎస్. మహబూబ్ బాషా పిలుపునిచ్చారు. కేరళ వరద బాధితులకు అండగా నిలించేందుకు గురువారం స్థానిక రైల్వే స్టేషన్‌లోని షాపుల వద్దకు హమాలీ కార్మికులతో కలిసి నిధుల సమీకరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో రైల్వే గూడ్స్ షెడ్ హమాలీ వర్కర్స్ యూనియన్ నాయకులు పాలయ్య, చిన్న ఓబులేసు, నాగేంద్ర, మల్లి, దస్తగిరి పాల్గొన్నారు.

విద్యా కమిటీలు ఎన్నిక



స్కూల్ యాజమాన్య కమిటీ నియామక పత్రాన్ని అందజేస్తున్న కార్పొరేటర్ షఫీ

కడప కార్పొరేషన్: కడప నగరంలోని గుంతబజార్, రమేష్ థియేటర్ ఎదురుగా ఉన్న ఆర్కే నగర్ మున్సిపల్ ఉర్దూ పాఠశాలలలో స్కూల్ యాజమాన్య కమిటీలను ఎన్నిక చేసినట్లు 30వ డివిజన్ కార్పొరేటర్ ఎస్ఎండీ షఫీ తెలిపారు. గుంతబజార్ పాఠశాల యాజమాన్య కమిటీ ఛైర్‌పర్సన్‌గా కరిమున్నీసా, వైస్ ఛైర్మన్‌గా ఎస్. తాజున్ ఎంపికయ్యారన్నారు. అలాగే ఆర్కే నగర్ పాఠశాల యాజమాన్య కమిటీ ఛైర్‌పర్సన్‌గా హసీనా, వైస్ ఛైర్మన్‌గా కుత్బుతుల్లాలను ఎన్నుకున్నారన్నారు. అనంతరం వారితో ప్రధానోపాధ్యాయులు ప్రతిజ్ఞ చేయించారు. పాఠశాల అభివృద్ధి, గుణాత్మక విద్యను పెంపొందించడంలో, పిల్లల రోజువారీ హాజరు, బాలికా విద్యను అభివృద్ధి పరచడంలో, ప్రభుత్వం సూచించిన కార్యక్రమాలను అమలు చేయడంలో పాఠశాల విద్యా కమిటీ కృషి చేస్తుందని ప్రధానోపాధ్యాయులు తెలిపారు.

వినేష్ ఫోగట్‌పై అనర్హత వేటు వేయడం దారుణం



ఐటీఐ కళాశాల ఎదుట నిరసన తెలుపుతున్న డీవైఎఫ్ఐ నాయకులు

కడప వైఎస్ఆర్ సర్కిల్: పారిస్ ఒలింపిక్స్‌లో వినేష్ ఫోగట్‌పై అనర్హత వేటు వేయడం తీవ్రంగా ఖండిస్తున్నామని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం నగరంలోని ఐటీఐ కళాశాల ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినేష్ ఫోగట్‌పై అనర్హత వేటు వేయడం ఆమెకు అన్యాయం మాత్రమే కాదని, మన క్రీడా వ్యవస్థపై లక్షలాది మంది భారతీయులు ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయడమేనన్నారు. వినేష్ ఫోగట్‌కు న్యాయం చేయాలని డిమాండ్ చేయడంలో క్రీడా సోదరులు, మీడియా, భారతదేశ ప్రజలు ఏకం కావాలని కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు రెబ్బా నరసింహులు, బాలాజీ, గణేష్, హేమంత్, జశ్వంత్, నిత్య, విద్యార్థినులు పాల్గొన్నారు.

కళాకారులకు సత్కారం

కడప కల్చరల్ : కడప రాజీవ్ కల్చరల్ క్లబ్‌లో గురువారం వైఎస్సార్ జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి ఆధ్వర్యంలో తిరుపతి వెంకట కవుల్లో ఒకరైన చెళ్ళపిళ్ల వెంకట శాస్త్రి జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా కవి వెల్లాల వెంకటేశ్వరాచారి, జీవకళ సత్యనారాయణ, గడికోట రెడ్డెయ్యలు పాండవోద్యోగం నాటకంలోని పద్యాలను ఆలపించి అలరించారు. వారితోపాటు తబల కళాకారుడు గంగయ్య, చాపల పెంచలయ్య, పుల్లయ్య, హార్మోనిస్టులను నిర్వాహకులు సత్కరించారు. కార్యక్రమంలో కళాకారులు బాల ఓబయ్య, గంగయ్య తదితరులు పాల్గొన్నారు.



పాలకొండ్రాయుడి మూలవిరాట్

ప్రతి ఏటా స్వామి దర్శనానికి వస్తా..



ఎన్ని పనులున్నా, మేము ఏటా శ్రావణ మాసంలో పాలకొండరాయుడి దర్శనానికి తప్పకుండా వస్తుంటాం. స్వామివారి కల్యాణంలో పాల్గొంటాం. కుల దైవంగా ఈ స్వామి, అమ్మవార్లను ఆరాధిస్తుంటాం. మాకే కాదు.. చాలా మందికి ఇక్కడి పాలకొండరాయుడు ఇలవేల్పు.

- సగబాల పాలకొండరాయుడు, కడప

ఆహ్లాదం.. ఆధ్యాత్మికం..



కడప నగర శివార్లలోని పాలకొండలు ఆహ్లాదానికి, ఆధ్యాత్మికానికి నెలవుగా నిలిచాయి. శ్రావణమాసంలో ఇక్కడ వెలసిన పాలకొండరాయుడిని దర్శించు కునేందుకు భక్తులు భారీగా వస్తారు. కార్తీకమాసంలో కూడా ఇక్కడ వన భోజన కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఈ దేవుడు.. వరాల దేవుడిగా విరాజిల్లుతున్నాడు.

- బెస్తవేముల రామమహేష్, కడప

పాలకొండల్లో.. వరాల దేవుడు

ఎత్తయిన కొండలు.. చుట్టూ పరుచుకున్న పచ్చదనం.. ఆహ్లాదకర వాతావరణం.. చల్లటి గాలులతో .. కోనేటి గలగలలతో ముచ్చట గొలిపే ప్రాంతం పాలకొండల సొంతం. ప్రకృతి రమణీయతకు అద్దం పట్టే ఇక్కడ పాలకొండ్రాయుడు కొలువై ఉన్నాడు. వరాలదేవుడిగా ఆయన భాసిల్లుతున్నాడు. ఏటా శ్రావణమాసంలో ఇక్కడ విశేష పూజలు నిర్వహించడం ఆనవాయితీ. జిల్లా నలుమూలల నుంచే గాక ఇతర జిల్లాల భక్తులు స్వామిని దర్శించుకోవడానికి తరలివస్తారు.



ప్రకృతి రమణీయత మధ్య కొలువైన పాలకొండ్రాయుడి ఆలయం

కడప కల్చరల్ : కడప నగరానికి సమీపంలోని పాలకొండల్లో శ్రావణమాసమంతా భక్తుల సందడి పెద్దగా కనిపిస్తుంది. ఇటీవల కురుస్తున్న వర్షాలకు ఆ ప్రాంతమంతా ఆకుపచ్చదనం పరుచుకుని ఉండడంతో చూపరులకు ఎంతో ఆహ్లాదంగా కనిపిస్తోంది. చల్లని గాలి క్షణాలలో సేద తీరుస్తుంది. ఆ కొండ, అందులోని కోనలు ఎంతో మనోహరంగా కనిపిస్తూ ఉల్లాసాన్ని పెంచుతాయి. ప్రధానంగా శ్రావణమాసంతోపాటు కార్తీక మాసమంతా నగర వాసులు ఈ ప్రాంతంలో వన భోజనాలు చేస్తారు. దీంతో ఈ రెండు మాసాలు పాలకొండలు భక్తులతో కళకళలాడుతాయి.

- మిగతా రోజులలో కూడా భక్తులు వస్తారు. ప్రత్యేకించి ఈ క్షేత్రానికి శ్రావణమాసంలో మరింత అధిక స్థాయిలో భక్తులు వస్తారు. ఇక్కడి కొండ లోయలో వెలసి ఉన్న శ్రీ లక్ష్మి పాలకొండ్రాయ స్వామి ఆలయాన్ని దర్శించుకుని స్వామి, అమ్మవార్లకు పూజలు చేస్తారు. శ్రావణమాసమంతా ప్రతిరోజు ఆలయంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు పూజలు కొనసాగుతాయి. శనివారాలలో ఉదయం నుంచి విశేష అభిషేకాలు, మూలమూర్తులకు కనుల పండువగా అలంకారం నిర్వహిస్తారు. కింది నుంచి కొండపైకి వెళ్లేందుకు మెట్ల మార్గం ప్రారంభమయ్యేచోట స్వాగత తోరణం (ఆర్చి) భక్తులకు ఆహ్వానం పలుకుతూ రాతి మెట్ల మార్గం ఉంది. తోరణం ఎదుట స్వామి వారి పాదాలను ప్రతిష్ఠించారు.

కొండపైకి వెళ్లే భక్తులంతా తొలుత పాదాల వద్ద పూజలు నిర్వహించి, కొబ్బరికాయలు సమర్పిస్తారు. ఆ ప్రాంతంలో మిట్టపల్లాలను సవరించి చదును చేసి మైదానంలా తీర్చిదిద్దారు.

పిల్లలకు స్వామి పేరు..

ఈ స్వామిని కుల దైవంగా ఆరాధించేవారు ఈ ప్రాంతంలో అధికంగా ఉన్నారు. పలువురు తమ పిల్లలకు పాలకొండయ్య, పాలకొండ్రాయుడు అని పేర్లు పెట్టుకోవడం పరిపాటి. ఏటా ఇక్కడికి వచ్చి పూజలు చేయడం ఆనవాయితీ.

కొండంతా ఆహ్లాద పరవళ్లు

పాలకొండలకు వచ్చే వాళ్లు కేవలం ఆధ్యాత్మికతకేగాక ఆహ్లాదానికి కూడా ప్రాధాన్యత ఇస్తున్నారు. మండే ఎండలో సైతం పాలకొండ లోయలో భారీ వృక్షాల నీడలో ఎంతో చల్లగా ఉండడం విశేషం. అందుకే వేసవిలో కూడా ఆలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో వస్తుంటారు. కార్తీక మాసంలో భక్తులు వన భోజనాలు కూడా చేసుకుంటారు. కొండ లోయలో భారీ వృక్షాలు, తీగలు, పొదలు, సెలయేర్లు ఉండడంతో వాతావరణం ఎంతో ఆహ్లాదంగా ఉంటుంది. స్వామి ఆలయ సమీపంలో గణపతి, ఆంజనేయస్వామి, గరుడ ఆళ్వార్, అచ్చమ్మ ఆలయాలు ఉన్నాయి. ఆలయం వెనుక, సమీపంలో చిన్న కొలను ఉంది. ఇక్కడి లోయలో సెలయేర్లు ఎంతో ఉల్లాసాన్ని కలిగిస్తాయి.

శ్రావణం.. పూజా సుగంధం

శ్రావణమాసంలో పాలకొండల్లోగల శ్రీ లక్ష్మి పాలకొండ్రాయస్వామికి విశేష పూజలు నిర్వహించనున్నట్లు కడప గ్రూప్ ఆఫ్ టెంపుల్స్ ఈఓ ఎ.శ్రీధర్ తెలిపారు. నాలుగు శనివారాల్లోనూ ఉదయం 5.30 గంటలకు విశేష అభిషేకాలు, 8 గంటలకు సర్వదర్శనం ఉంటాయన్నారు.

- 10వ తేదీ మొదటి శనివారం విశేష అభిషేకం, అలంకారం ఉంటాయన్నారు. 17న రెండవ శనివారం, 31న నాల్గవ శనివారం కూడా ఇవే పూజలు నిర్వహిస్తారన్నారు.

- 24న మూడవ శనివారాన్ని పురస్కరించుకుని ఉదయం 11 గంటల నుంచి ఆలయ ప్రాంగణంలో స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తామని తెలిపారు. ఇందులో తలంబ్రాలుగా ముత్యాలను వాడనున్నట్లు, వాటిని భక్తులకు కల్యాణ ప్రసాదంగా అందజేస్తామని తెలిపారు.

దేవుని కడప అర్చకుల పూజలు

పాలకొండ్రాయస్వామికి దేవునికడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి ఆలయానికి ఒక బంధం ఉంది. దేవుని కడప ఆలయాన్ని నిర్మించిన సమయంలో చాలా కాలం పాటు అర్చకులు పాలకొండలకు వచ్చి ఇక్కడి పాలకొండరాయస్వామి, లక్ష్మీమాతకు అభిషేకాలు, పూజలు నిర్వహించేవారని కడప షహర్ కై ఫీయత్తుల ద్వారా తెలుస్తోంది.

- మెట్లపై పాలు పోసుకుంటూ కొండపైకి ఎక్కే సంప్రదాయం ఉండడంతో దీన్ని పాలకొండగా పేర్కొంటారు. పురాణాల్లో సైతం క్షీర పర్వతంగా దీని ప్రస్తావన ఉందని పెద్దలు చెబుతున్నారు. మొక్కులుగల భక్తులు కొండకింద ఆర్చి వద్ద శ్రావణమాసంలోని నాలుగు శనివారాలు అన్నదానం చేస్తారు.

జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ



విద్యార్థి శర్వానందరెడ్డికి షీల్డ్‌ను అందచేస్తున్న అధికారులు

కడప ఎడ్యుకేషన్: మైదుకూరులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం నిర్వహించిన డాక్టర్ ఎల్లా ప్రగడ సుబ్బారావు స్మారక జిల్లాస్థాయి సైన్సుఫేర్‌లో కడప అంధుల ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి ప్రతిభ చాటి మూడవ బహుమతిని సాధించాడు. కడప శంకరాపురంలోని ప్రభుత్వ అంధుల పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థి శర్వానందరెడ్డి పాఠశాల సైన్సు టీచర్ ఎబినేజర్ మార్గదర్శకత్వంలో ఉప్పునీటితో నడిచే కారును తయారు చేసి మూడవ బహుమతిని సాధించాడు. సముద్రపు ఉప్పునీటితో కారు నడిచే విధంగా తమ ప్రాజెక్టును ప్రదర్శించారు. ఈ ప్రాజెక్టును సైన్సుఫేర్ జడ్జిలు పరిశీలించి మూడవ ప్రైజ్‌కు ఎంపిక చేశారు. ప్రైజ్ కింద రూ. 1000 నగదు, ప్రశంసాపత్రం, షీల్డ్‌ను అందచేసి సత్కరించారు.

ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్



రిమ్స్‌లో ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న సీఐ సీతారామిరెడ్డి

కడప అర్బన్: కడప నగరంలో నుంచి రిమ్స్‌కు వచ్చే, వెళ్లే ఆటో డ్రైవర్లు బాధ్యతాయుతంగా నడపాలనిని కడప రిమ్స్ పీఎస్ సీఐ సీతారామిరెడ్డి తెలియజేశారు. గురువారం ఆయన రిమ్స్‌లో ఆటో డ్రైవర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఆటోలను క్రమపద్ధతిలో, ప్రయాణికులకు ఇబ్బంది కలిగించకుండా చూసుకోవాలన్నారు. ఆటో ఛార్జీలను అధికంగా వసూలు చేయరాదన్నారు. క్రమశిక్షణగా ఉండాలన్నారు. ఏవైనా అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నా తమ దృష్టికి తీసుకురావాలన్నారు.

సత్వర సేవలు అందించాలి



వార్డు సచివాలయంలో రికార్డులను తనిఖీ చేస్తున్న అదనపు కమిషనర్ రాకేష్ చంద్రన్

కడప కార్పొరేషన్: వార్డు సచివాలయాల ద్వారా సత్వర సేవలు అందించాలని నగరపాలక అడిషనల్ కమిషనర్ కె. రాకేష్ చంద్రన్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఏడురోడ్ల కూడలి వార్డు సచివాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అటెండెన్స్ రిజిస్టర్లను, మూమెంట్ రిజిస్టర్లను పరిశీలించారు. సిబ్బంది సమయపాలన పాటించాలని, ప్రతి ఒక్కరూ ఐడీ కార్డులు తప్పనిసరిగా ధరించాలని ఆదేశించారు. ప్రజలతో మర్యాదపూర్వకంగా మాట్లాడాలని, వారికి కావాల్సిన సేవలను తక్షణమే చేసి పంపే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమయం, సేవల్లో నిర్లక్ష్య వైఖరి ప్రదర్శిస్తే క్రమశిక్షణా చర్యలు తప్పవన్నారు. మార్నింగ్ విజిట్‌లో భాగంగా ఆయన సంధ్యా సర్కిల్, ఎర్రముక్కపల్లె ప్రాంతాలను పరిశీలించారు. ఎర్రముక్కపల్లె రోడ్డులో జనసంచారం ఎక్కువగా ఉండటం వల్ల ఉదయాన్నే మెయిన్‌రోడ్ స్వీపింగ్ చేయాలన్నారు. బుగ్గ అగ్రహారం, మామిళ్లపల్లె ప్రాంతాలలో కచ్చా డ్రైన్ మరమ్మతులు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ సునీల్, శానిటేషన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వైవీయూ ఇన్‌చార్జ్ వీసీని తొలగించాలి



ఆర్ట్స్ కళాశాల ఎదుట ఆందోళన చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

కడప వైఎస్ఆర్ సర్కిల్: వైవీయూ ఇన్‌ఛార్జి వీసీ కృష్ణారెడ్డిని వెంటనే తొలగించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.శివశంకర్, వలరాజు అన్నారు. వైవీయూ ఆర్ట్స్ కళాశాల ప్రధాన ద్వారం ఎదుట ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో గురువారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొత్తగా వచ్చిన టీడీపీ ప్రభుత్వం యూనివర్సిటీల విషయంలో మంచి నిర్ణయం చేస్తుందని అనుకున్నామన్నారు.కృష్ణారెడ్డి ప్రిన్సిపల్‌గా ఉన్న సమయంలో మహిళా ఉద్యోగిపై అసభ్యంగా ప్రవర్తించారని, కృష్ణా యూనివర్సిటీలో రిజిస్ట్రార్‌గా వున్నప్పుడు ఏసీబీ అధికారులు దాడులు చేశారని తెలిపారు. అలాంటి వ్యక్తి వైవీయూ అభివృద్ధికి ఎలా తోడ్పాటు అందిస్తారని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నగర ఉపాధ్యక్షుడు అకీరానంద్, చంద్ర, ఈశ్వరరెడ్డి అభిరామ్, విద్యార్థులు పాల్గొన్నారు.

సన్మానం

కడప ఎడ్యుకేషన్: కడప నగరంలోని 27వ డివిజన్ గౌస్‌నగర్‌లో మున్సిపల్ కార్పొరేషన్ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో గురువారం ప్రధానోపాధ్యాయురాలు బిబి ఆయేషా అధ్యక్షతన పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో సయ్యద్ సలీమా బేగంను ఛైర్మన్, వైస్ ఛైర్మన్‌గా ఆరిఫ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ ఎన్నికల్లో కో ఆప్షన్ మెంబర్‌గా స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి జీకే జనం కోసం వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపకులు పటాన్ ఖాదర్‌బాషాను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు . ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి తమ వంతుగా పాటుపడతామని తెలిపారు. అనంతరం స్కూల్ యాజమాన్య కమిటీ సభ్యులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రేమ్ కుమార్, సఫీనా, 27 వ డివిజన్ గౌస్ నగర్ ముస్లిం మైనార్టీ నాయకులు అమానుల్లా షేక్, ఖాదురు, బకార్, షఫీవుల్లా, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పచ్చని చెట్లు- ప్రగతికి మెట్లు

వేంపల్లె : పచ్చని చెట్లు ప్రగతికి మెట్లని భారతీయ జనతా పార్టీ జిల్లా ఉపాధ్యక్షురాలు సుష్మా అన్నారు. గురువారం స్థానిక తహసీల్దార్, పోలీసు స్టేషన్ ఆవరణలో తహసీల్దార్ హరినాథ్‌రెడ్డి, సీఐ సురేష్‌రెడ్డిలతో కలిసి ఆమె మొక్కలు నాటి నీరు పోశారు. ఆమె మాట్లాడుతూ దేశప్రధాని మోదీ పిలుపు మేరకు అమ్మపేరుతో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరు మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలన్నారు. అలాగే నూతన బాధ్యతలు చేపట్టిన మండల తహసీల్దార్ హరినాథ్‌రెడ్డి, సీఐ సురేష్‌రెడ్డిలకు స్వాగతాభిమానం తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు సునీల్, ప్రసాద్‌రెడ్డి, చరణ్, తదితరులు పాల్గొన్నారు.

అనుమతి లేని పాఠశాలపై చర్యలు తీసుకోవాలి

కడప ఎడ్యుకేషన్: జిల్లాలోని బద్వేల్ పట్టణంలో రెండు సంవత్సరాలుగా అనుమతులు లేకుండా పాఠశాల నిర్వహిస్తున్న బద్వేల్ పబ్లిక్ స్కూల్‌పై చర్యలు తీసుకోవాలని ఆర్ఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రశాంత్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం కడపలోని ఆర్‌జేడీ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనుమతులు లేకుండా పాఠశాల నిర్వహిస్తూ విద్యార్థులను, తల్లిదండ్రులను మోసం చేస్తున్నారన్నారు. విద్యాశాఖ అధికారులు ఆ పాఠశాల యాజమాన్యం పై ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. అనంతరం ఆర్‌జేడీ కార్యాలయ ఏడీ అరుణ కుమార్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్ ఎస్ యు రాష్ట్ర కమిటీ సభ్యుడు చరణ్, జిల్లా కమిటీ సభ్యుడు కొండేటి హరిబాబు, సాయి, శివ, ఇర్ఫాన్, శ్యామ్, కిరణ్ పాల్గొన్నారు.



ఆర్‌జేడీ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న ఆర్ఎస్‌యూ నాయకులు



మృత్యుంజయకుంటలోని శివాలయం పుట్టవద్ద పూజలు నిర్వహిస్తున్న భక్తులు



చెన్నై రోడ్డులోని పుట్ట వద్ద భక్తుల పూజలు

నాగయ్యా... కాపాడవయ్యా!

కడప కల్చరల్ : శ్రావణ మాసం చవితి సందర్భంగా గురువారం కడప నగరంలో భక్తులు నాగుల చవితిని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మృత్యుంజయకుంట శివాలయ ప్రాంగణం, తహసీల్దార్ కార్యాలయం వెనుక గల నాగులకట్ట, శ్రీ రాజరాజేశ్వరీదేవి ఆలయ ప్రాంగణంలోని నాగుల దేవతల విగ్రహాల వద్ద, ఇంకా పలు దేవాలయాలలోని నాగుల విగ్రహాల వద్ద భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మరికొందరు సమీపంలోని పుట్టల వద్ద కూడా పూజలు చేశారు.

మాజీ సైనికులకు ఇంటి స్థలాలు మంజూరు చేయాలి



కలెక్టర్ శివశంకర్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న మాజీ సైనికులు

కడప రూరల్: జిల్లాలోని మాజీ సైనికులకు ఇంటి స్థలాలు కేటాయించాలని ది కడప డిస్ట్రిక్ట్ ఎక్స్-సరీ్వస్‌మెన్ కో ఆపరేటివ్ హౌసింగ్ బిల్డింగ్ సొసైటీ అధ్యక్షులు జడ్ ఫిలిప్స్ కోరారు. ఆ మేరకు గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్ శివశంకర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఫిలిప్స్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఉన్న మాజీ సైనికులకు ఒకరికి ఐదు సెంట్ల చొప్పున స్థలం మంజూరు చేయాలన్నారు. ఈ అంశానికి సంబంధించి కలెక్టర్ సానుకూలంగా స్పందించినందుకు వారు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో చంద్రాయుడు, ఐజయ్య, సైమన్, లక్ష్మీనారాయణ, కెప్టెన్ రాజశేఖర్, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

మానసిక పరిపక్వత అవసరం

వైవీయూ: విలువలు లేని విద్య వ్యర్థమని, భావోద్వేగాలను నియంత్రించుకోవడంలో విఫలమైతే అనేక అనర్థాలు సంభవిస్తాయని కడప ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా. వి. సలీంబాషా అన్నారు. కళాశాలలో సెల్ అండ్ సీక్ శిక్షణ కార్యక్రమం రెండోరోజు గురువారం కొనసాగింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ యువతకు నైతిక విలువలు బోధించడం ద్వారా మానసిక పరిపక్వతను సాధించవచ్చునని తెలిపారు. రీసోర్స్ పర్సన్‌లు డా. సుందరేశ్వరరావు, డా. లలిత మాట్లాడుతూ ఈర్ష్య, ద్వేషం, పగ, పంతం, కోపం లాంటి భావోద్రేకాలను ఎలా అదుపులో ఉంచుకోవాలో వివరించారు. అనంతరం శిక్షణ కార్యక్రమానికి సంబంధించిన హ్యాండ్‌బుక్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో నోడల్ రిసోర్స్ సెంటర్ కోఆర్డినేటర్ ఎం.వి. రమణయ్య, మెంబర్స్ పి.వి. సుబ్బారెడ్డి, రీసోర్స్ పర్సన్‌లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

క్యాంపస్ ఇంటర్వ్యూలు



ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులతో ప్రిన్సిపాల్ తదితరులు

వైవీయూ: కడప నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో గురువారం నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలకు చక్కటి స్పందన లభించింది. లలిత జువెలర్స్ లిమిటెడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎంపికలకు దాదాపు 600 మంది అభ్యర్థులు హాజరుకాగా, వీరిలో ప్రతిభ కనబరిచిన 120 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా. వి. సలీంబాషా తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు నైపుణ్యాలను పెంపొందించుకోవడం ద్వారా ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో జేకేసీ కోఆర్డినేటర్ సుజాత, మెంటార్ వరప్రసాద్, లలిత జువెలర్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

117 జీఓ రద్దు చేయాలి

కడప ఎడ్యుకేషన్: జిల్లాలో ప్రస్తుతం ఉపాధ్యాయులకు జీవో 117 ప్రకారం వర్క్ అడ్జెస్ట్‌మెంట్ ద్వారా బదిలీలు జరపాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని పునరాలోచించాలని ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీలు సివి ప్రసాద్, చంగల రెడ్డి, జిల్లా అధ్యక్ష ,ప్రధాన కార్యదర్శులు ఈశ్వరచంద్ర ఆలీఖాన్ కోరారు. పాఠశాల విద్యకు కంటకం గా మారిన జీవో 117 రద్దు చేయాలని కోరుతున్నప్పటికీ పట్టించుకోవడం లేదన్నారు. ఉన్న ఖాళీలను డీఎస్సీ ద్వారా భర్తీ చేసేంతవరకు విద్యావాలంటీర్లతో అవసరం ఉన్న చోట సర్దుబాటు చేయాలని తెలిపారు. ఉపాధ్యాయులు గందరగోళానికి గురికాకుండా చూడాలని కోరారు.

పదోన్నతుల తర్వాతే సర్దుబాటు చేయాలి

కడప ఎడ్యుకేషన్: రాష్ట్రంలో ఉన్నత పాఠశాలల్లో అనేక సబ్జెక్టుల ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉందని ఎస్‌జీటీలకు పదోన్నతులు కల్పించి సర్దుబాటు ప్రక్రియ చేపట్టాలని ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కంభం బాలగంగిరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వం ఆలోచించి మొదట పదోన్నతుల ద్వారా ఖాళీలు భర్తీ చేసి తర్వాత సర్దుబాటు చేస్తే బాగుంటుందని తెలిపారు.

క్విట్ ఇండియా ఉద్యమం ఓ చరిత్ర



గాంధీ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న డీసీసీ బ్యాంకు సిబ్బంది

కడప అగ్రికల్చర్: గాంధీజీ నాయకత్వంలో చేపట్టిన క్విట్ ఇండియా ఉద్యమం చరిత్రలో నిలిచిపోయిందని కడప డీసీసీ బ్యాంకు స్పెషల్ క్యాడర్ డిప్యూటీ రిజిస్ట్రార్ గురప్ప అన్నారు. క్విట్ ఇండియా ఆగస్టు క్రాంతిదినం పురస్కరించుకుని గురువారం కడప కోటిరెడ్డి సర్కిల్‌లోని మహాత్మ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్విట్ ఇండియా ఉద్యమం ఫలితంగానే మనం స్వాతంత్ర్యం పొందామన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ బ్యాంకు డీజీఎం వేంకటేశ్వర్లు, ఏజీఎం నారాయణరాజు, చీఫ్ మేనేజర్ చంద్రశేఖర్, మేనేజర్ ఆంజనేయరెడ్డిలు పాల్గొన్నారు.